సాక్షి
గుంటూరు
మంగళవారం, 21, నవంబర్, 2023



ఈమనిలో ఇరుముడులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం ఈమనిలో సోమవారం అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో ఇరుముడులు కట్టించుకున్నారు.



వెండి త్రిశూలం బహూకరణ

నకరికల్లు: నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామికి టి.శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు సోమవారం రూ.2.25 లక్షల వెండి త్రిశూలాన్ని బహూకరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ దశమ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు శాంతికల్యాణం నిర్వహించారు.

న్యూస్‌రీల్

నవోదయకు 1,532 దరఖాస్తులు

యడ్లపాడు: జాతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 9,11 తరగతుల ప్రవేశ పరీక్షలకు సంబంధించి 1,532 దరఖాస్తులు వచ్చినట్లు చిలకలూరిపేట మండలం మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయా తరగతుల మిగుల సీట్ల భర్తీ కోసం నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు ఈనెల 15తో దరఖాస్తు గడువు ముగిసిందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 9వ తరగతికి 950 మంది, అలాగే 11వ తరగతికి 582 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..


2024 ఫిబ్రవరి 10న నిర్వహించే పరీక్ష కేంద్రాలను నరసింహారావు వెల్లడించారు. చిలకలూరిపేట పట్టణంలోని సాధినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్, శారద జెడ్పీ హైస్కూల్, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్, ఏఎంజీ హైస్కూల్, నవోదయ విద్యాలయాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలోనే విద్యార్థులకు అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో ఉంచుతామని, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా కోరారు.

యార్డుకు 29,271 బస్తాల మిర్చి రాక




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 26,681 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,271 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,500 నుంచి రూ.23,200 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,362 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,440, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 840.70 అడుగుల వద్ద ఉంది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2212 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 147, బ్యాంక్ కెనాల్‌కు 243, తూర్పు కెనాల్‌కు 107 , పశ్చిమ కెనాల్‌కు 47 , నిజాంపట్నం కాలువకు 243, కొమ్మమూరు కాల్వకు 733 క్యూసెక్కులు విడుదల చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.2,800, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

కార్తికం.. ప్రకా'శివ'ంతం



పెదకాకానిలో కొలువైన భ్రమరాంబ మాత



పెదకాకాని మల్లేశ్వరస్వామి



కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి



పెదకాకానిలో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

కార్తిక మాసం తొలి సోమవారం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ, పెదకాకాని శివ క్షేత్రాలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామిని దర్శించుకుని తరించారు. తొలుత భక్తులు యజ్ఞాల బావి వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తిక దీపాలు వెలిగించారు. పొంగలి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. సోమవారం ఒక్కరోజు 7,18,515 రూపాయల ఆదాయం లభించింది. ఉచిత అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. కోటప్పకొండలోనూ భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. - పెదకాకాని/కోటప్పకొండ



కోటప్పకొండ ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వృద్ధులు, దివ్యాంగులను పదేపదే తిప్పుకోవద్దు

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్యులతోపాటు వృద్ధులను, దివ్యాంగులను పదేపదే తిప్పుకోవద్దని, వారి సమస్యలు వినగానే సంబంధిత సిబ్బందికి అప్పగించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ సేవలను మానవత్వంతో అందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూనే వృద్ధులకు, దివ్యాంగులకు అండగా నిలవాలన్నారు. ఇటీవల కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన సిబ్బంది సీనియర్ల వద్ద పని నేర్చుకోవాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. కార్యాలయ పనివేళలు ఖచ్చితంగా పాటించాలన్నారు. అనంతరం వచ్చిన 237 అర్జీలను కలెక్టర్, జేసీ, డీఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా అధికారులు పరిశీలించారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ఆరోగ్యం సహకరించడంలేదు సాయం చేయండి



నేను బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడిని. ఈ ఏడాది జూలైలో పిడుగు పడి నా కుడి చేయి పోయింది. తలలోని కొన్ని నరాలతోపాటు పాదాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఏ పనీ చేసుకోలేని దీన స్థితి. ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం ద్వారా నాకు రావాల్సిన ఆర్థిక సాయం ఇప్పించండి.

– జి వీరాంజనేయులు, డోకిపర్రు గ్రామం, మేడికొండూరు మండలం

అడంగల్‌లో మా పేర్లు తొలగించారు



తాడికొండ మండలం, లాం గ్రామంలో సర్వే నంబర్ 311–3లో మాకు 10 సెంట్ల రిజిస్టర్ భూమి ఉంది. అడంగళ్లతోపాటు దస్తావేజులు కూడా మాపేరునే ఉండేవి. స్థానిక సిబ్బంది సహకారంతో కొందరు మా పేర్లు తొలగించి, మా భూమిలో వారి పేర్లు నమోదు చేసుకున్నారు. న్యాయం చేయండి.

– పి.విజయలక్ష్మి, శేషిరెడ్డి, గుంటూరు

యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం



ఆదిలక్ష్మి, అధ్యక్షురాలు



కళాధర్, ప్రధాన కార్యదర్శి

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పొన్నూరులో జరిగిన జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశంలో భాగంగా గుంటూరు జిల్లా శాఖకు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్ష, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా తిరిగి ఎన్నికైన ఆదిలక్ష్మి, కళాధర్ సోమవారం తెలిపారు. అలాగే జిల్లా గౌరవాధ్యక్షునిగా పీవీ శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, కోశాధికారిగా ఎండీ గయాసుద్దౌలాతోపాటు, జిల్లా కార్యదర్శులుగా సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, డి.సాయికృష్ణ, జి. వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, టి. ఆంజనేయులు, యు.రాజశేఖర్, జీవీ ధనలక్ష్మి, కె.కేదార్‌నాథ్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

కొల్లిపర వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా

రూ.4.19 కోట్లతో జీఓ జారీ



బొంతు గురవారెడ్డి

కొల్లిపర(తెనాలి): కొల్లిపరలో కొలువుల రోజున ప్రభుత్వం తీపి కబురు అందించింది. లంక గ్రామాల నుంచి, విజయవాడ–రేపల్లె వైపు నుంచి కరకట్ట మీదుగా కొల్లిపరకు రాకపోకలకు అతిప్రధానమైన పురాతన వంతెన స్థానంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి జీఓ జారీ చేసింది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున రోడ్లు, వాటిని అనుసంధానం చేసే వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (ప్రోగ్రెస్.1) ద్వారా 788 జీఓను జారీచేసింది. ఇందులో కొల్లిపరలోని వంతెన నిర్మాణానికి రూ.4.19 కోట్లను కేటాయిస్తూ అనుమతులు మంజూరు చేయటం విశేషం. రేపల్లె బ్యాంక్ కెనాల్‌పై 32.75వ కిలోమీటరు వద్ద దీనిని నిర్మిస్తారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ చిన్నవంతెన శిథిలావస్థకు చేరుకున్న విషయం తెలిసిందే. విజయవాడ–రేపల్లె కరకట్ట మార్గంలో రాకపోకలు చేయాలన్నా, కృష్ణా తీరంలో సాగుచేసిన పంటల రవాణాకు ఈ వంతెన ఎంతో కీలకం. దీని ఆవశ్యకతను గుర్తించిన గ్రామానికి చెందిన ప్రముఖుడు బొంతు గురవారెడ్డి కొంతకాలం క్రితం ముఖ్యమంత్రి కార్యదర్శి సాల్మోన ఆరోక్యరాజ్‌కు వివరించి, కొత్త వంతెన నిర్మాణానికి అనుమతుల మంజూరు కోసం కృషిచేశారు. ఎంతోమంది సహకారం కూడా తీసుకున్నారు. అన్ని అవరోధాలు దాటుకుని రూ.4.19 కోట్లతో అనుమతులు మంజూరుచేస్తూ జీవో రావటంపై బొంతు గురవారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. మన ఊరు మన బాధ్యతగా కొల్లిపర వంతెన నిర్మాణానికి తన వంతు సహకారం అందించానని చెప్పారు. త్వరలోనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తారని వివరించారు. కొన్ని దశాబ్దాలుగా కొల్లిపర వంతెనను నిర్మాణాన్ని సాకారమయ్యేలా కృషిచేసిన గురవారెడ్డికి రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి గ్రామప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



కొల్లిపర వంతెన

23 నుంచి భవానీ మండల దీక్షలు

- 26న కోటి దీపోత్సవం
- డిసెంబర్ 13 నుంచి అర్ధమండల దీక్షలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఈనెల 23వ తేదీ గురువారం నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంద్రకీలాద్రిపై నిర్వహించే ఉత్సవాలలో రెండో అతి పెద్ద ఉత్సవమైన భవానీ దీక్షలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తారు. 23 నుంచి ఐదు రోజుల పాటు భక్తులు అమ్మవారి మండల దీక్షలను స్వీకరిస్తారు. దీక్ష స్వీకరణ కార్యక్రమాన్ని దేవస్థానం ఎంతో వైభవంగా నిర్వహిస్తుంది. గురువారం ఉదయం అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి పగడాలతో చేసిన దండను అలంకరిస్తారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రధాన ఆలయం నుంచి మహామండపం ఆరో అంతస్తుకు ఊరేగింపుగా తీసుకొస్తారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అఖండ జ్యోతి ప్రజ్వలనతో దీక్ష స్వీకరణ మహోత్సవం లాంఛనంగా ప్రారంభమవుతుంది. అమ్మవారి ఆలయంతో పాటు ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద, గురు భవానీల పీఠంలోనూ భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరిస్తారు.

26న కోటి దీపోత్సవం

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం వెలిగిస్తారు. 27వ తేదీ ఉదయం 5:55 గంటలకు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ జరుగుతుంది.



జనవరి 3 నుంచి దీక్షల విరమణ

డిసెంబర్ 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు భక్తులు అమ్మవారి అర్ధమండల దీక్షలను స్వీకరిస్తారు. ఇక డిసెంబర్ 26వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి కలశజ్యోతి మహోత్సవం విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి ప్రారంభమవుతుంది. దీక్ష విరమణలు వచ్చే ఏడాది జనవరి 3వ తేదీన ప్రారంభమై జనవరి 7వ తేదీ వరకు కొనసాగుతాయి. 3వ తేదీ ఉదయం మహామండపం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసే హోమగుండాలలో అగ్నిప్రతిష్ఠాపనతో దీక్ష విరమణలు ప్రారంభమవుతాయి. జనవరి 7వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో నిర్వహించే పూర్ణాహుతితో దీక్ష విరమణలు పరిసమాప్తమవుతాయి.

జగనన్న పాలనలోనే సాధికారత

మీడియా సమావేశంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, కారుమూరి

సాక్షి, నరసరావుపేట: సామాజిక సాధికారతను ఆచరణలో చూపిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రలో భాగంగా సోమవారం నరసరావుపేట ఏ–1 ఫంక్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రులు మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబుతో కలసి ఆదిమూలపు మాట్లాడారు. సామాజిక సాధికార యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2019లో రాష్ట్ర ప్రజలు తీసుకున్న మంచి నిర్ణయం వల్ల ఇప్పుడు ఫలితాలు అనుభవిస్తున్నామని, బలహీన వర్గాలు మరింత అభివృద్ధి చెందాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, చిత్రంలో ఎమ్మెల్సీ కుంభా రవి, మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాణిక్యవరప్రసాద్

మాటపై నిలబడే వ్యక్తి జగన్ : కారుమూరి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. జగనన్న పాలనలో బీసీలకు అధిక పదవులు దక్కాయన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. కేబినెట్ పదవుల్లో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ఘనత ఒక్క జగన్‌దేనన్నారు. జగనన్న పాలనలో నలుగురు బీసీలకు రాజ్యసభ పదవులు దక్కాయన్నారు. గతంలో 11 శాతానికి పైగా ఉన్న పేదరికం జగన్ పాలనలో ఏకంగా ఆరు శాతానికి తగ్గిపోయిందన్నారు. జీడీపీలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామంటే ఇది కాదా అభివృద్ధి అని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ ప్రజల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న మహోన్నత వ్యక్తి వైఎస్ జగన్ అని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు వ్యాఖ్యానించారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో బలహీనవర్గాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉన్నారని, ఎంతో అణిచివేతకు గురయ్యారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో వారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో వృద్ధి చెందారని వివరించారు. ఉన్నత వర్గాల పిల్లలు మాత్రమే ఇంగ్లిష్ మీడియంలో చదవాలన్న ప్రతిపక్షాల కుట్రలను ఛేదించి ప్రతి పేదింటి బిడ్డకూ నాణ్యమైన చదువులు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు.

బీసీలకు అండగా నిలిచిన జగన్

గత ప్రభుత్వాలు బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంక్‌గానే వినియోగించుకున్నాయని, వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ చెప్పారు. జగన్ ప్రభుత్వంలో బీసీల అభ్యున్నతికి విశేష కృషి జరిగిందని వివరించారు. వైఎస్సార్ తన హయాంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వాటితో రెండు అడుగులు ముందుకు వేస్తే జగనన్న నాలుగు అడుగులు ముందుకు వేసి మైనార్టీలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారన్నారు. మైనార్టీలకు ఇంత కన్నా ఎక్కువ మేలు చేసిన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. అందుకే మైనార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్నకు అండగా నిలుస్తున్నామన్నారు.

సాధికారతకు నిజమైన నిర్వచనం జగన్ పాలన

సమానత్వం, సాధికారత అనే పదాలకు నిజమైన నిర్వచనం వైఎస్సార్ సీపీ పాలన అని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాదరావు అన్నారు. విద్య, వైద్య ప్రమాణాలు పెంచి వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రజలకు వివరించేందుకు వచ్చామని పేర్కొన్నారు. అందరం కష్టించి మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

క్లుప్తంగా

పీఎం విశ్వకర్మ యోజనలో 18 రకాల వృత్తులకు అవకాశం

లక్ష్మీపురం: కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా 18 రకాల కుల వృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను తీసుకువచ్చింది. దీని ద్వారా ఆయా వృత్తుల్లో ఉన్న వారిని గుర్తించి వారికి మరింతగా సాంకేతికతను వినియోగించే విధంగా శిక్షణ ఇచ్చి, ఆ సమయంలో రోజువారీగా కొంత భృతి రూపంలో డబ్బులు ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం స్వయం ఉపాధికి జాతీయ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ప్రక్రియను మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చేపట్టనుంది. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. మరిన్ని వివరాలకు www. pmvishwakarma. gov. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

రైలు నుంచి జారిపడిన శివ భక్తుడు

తీవ్రగాయాలు



తాడేపల్లిరూరల్: విజయవాడ - చెన్నై రైల్వేమార్గంలో కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలో కృష్ణానదిపై రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలులో ప్రయాణిస్తున్న ఓ శివభక్తుడు సోమవారం జారిపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన కలవకోల శ్రీకాంత్ విజయవాడలో తెల్లవారుజామున తిరుపతి వెళ్లేందుకు రైలు ఎక్కాడు. గేటువద్ద నిలబడి ఫోన్ మాట్లాడి జేబులో పెట్టుకున్నాడు. ఒక్కసారిగా తూలుడు రావడంతో రైలులో నుంచి కిందపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ధరణీధర్, పైలెట్ శ్రీనివాసరావులు అక్కడకు చేరుకుని స్ట్రెక్చర్ సహాయంతో ట్రాక్ పక్కనే పడిఉన్న శ్రీకాంత్‌ను 108లోకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స నిర్వహించారు. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ధరణీధర్ తెలిపారు.

WANTED
Techno & Pre-Sales Expert
Male-1, Female-1
Qualifiction : B.Tech / MBA
•Good English Communicaiton is mandatory
Share your Resume at support@lingsaa.com
LINGSAA TECHNOLOGIES PVT.LTD Guntur

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట మోసం

'జగనన్నకు చెబుదాం'లో జిల్లా ఏఎస్పీకి బాధితుల మొర

నగరంపాలెం: ఉద్యోగాల పేర్లతో తమను మోసగించారని బాధితులు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ)ఆవరణలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో తెలిపారు. బాధితుల నుంచి జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం) అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఏఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్లు, వీసీ ద్వారా ఏఎస్పీ మాట్లాడారు. అర్జీదారుల ఫిర్యాదులకు సంబంధించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డీఎస్పీలు ప్రకాష్‌బాబు (క్రైం), బాల సుందరరావు (ట్రాఫిక్) అర్జీలు స్వీకరించారు.



అర్జీదారుల సమస్యలను ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు

సాఫ్ట్‌వేర్ డెవలపర్ అంటూ..

హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని అరండల్‌పేటలోని ఓ బ్రాంచి నిర్వాహకుడు నమ్మబలికాడు. దీంతో మా కుమార్తె ఉద్యోగం నిమిత్తం రూ.3.50 లక్షలను అతనికి చెల్లించాను. తమతోపాటు మరో అయిదుగురు బ్రాంచి నిర్వాహకుడికి రూ.14 లక్షల వరకు ముట్టజెప్పారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా మూడు నెలలు తర్ఫీదిస్తారని, రాయదుర్గంలోని ఒక కంపెనీ సీఈఓ అని మహిళను పరిచయం చేశారు. అనంతరం ఉద్యోగ నియమాక పత్రాలు అందజేసి, నెలకు రూ.50 వేలు జీతమని చెప్పారు. గుంటూరులో శిక్షణ ఇప్పిస్తామని చెప్పగా, అపాయిమెంట్ అర్డర్లపై అనుమానం వచ్చి ఆరాతీయగా అది ఫేక్ అని తేలింది. న్యాయం చేయగలరు.

– షేక్ ఖాదర్‌మొహిద్దీన్, చిన మసీదుబజార్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటూ రూ.3 లక్షలు నొక్కేశారు..

కొద్దినెలలు క్రితం ఆన్‌లైన్ ద్వారా.. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఉందని చూసి, క్లిక్ చేశా. దానికి సంబంధించి కొరిటెపాడులోని ఓ ప్లేస్‌మెంట్ సంస్థ ఉంది. దీంతో వారిని సంప్రదించగా, ఏడాదికి రూ.5 లక్షల జీతమని చెప్పారు. దీంతో ఆన్‌లైన్‌లో రెండుసార్లుగా రూ.2.50 లక్షలు, రూ.50 వేలు నేరుగా సదరు వ్యక్తికి అందజేశాను. శిక్షణ పేరుతో కాలయాపన చేస్తూ జీతం చెల్లించడంలేదు.. తిరిగి డబ్బులు చెల్లించమని అడిగితే అదిగో ఇదిగో అని దాటవేస్తున్నాడు. న్యాయం చేయగలరు.

– బి.వెంకట్రావు, త్రిపురాంతకం, ప్రకాశం జిల్లా

రూ.20 లక్షల వరకు మోసం చేశారు..

ప్రైవేటు కంపెనీకి సంబంధించి ఒక ఆన్‌లైన్ కంపెనీలో చేరా. అందులో టాస్కులను ఇచ్చేవారు. ఆ టాస్కులు పూర్తిచేసిన తరువాత మళ్లీ ఇచ్చేవారు. ఈ క్రమంలో మొదటగా రూ.30 వేలు చెల్లించారు. అనంతరం మరలా టాస్కులు మొదలయ్యేవి..ఇలా వరుస టాస్కులతో పలు పేర్లను చెప్పి నా వద్ద రూ.20 లక్షల వరకు కాజేశారు. మేం చెల్లించిన రూ.20 లక్షలు చెల్లించాలని అడిగితే మరో రూ.50 వేలు చెల్లించాలని అంటున్నారు. ఇటువంటి మోసగాళ్లపై చర్యలు చేపట్టాలి.

– జె.రవితేజ, ఏటీ అగ్రహారం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

నెహ్రూనగర్: ఉద్యోగుల సమస్యలపై అందే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి డిప్యూటీ కమిషనర్లను, విభాగాధిపతులను ఆదేశించారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల 3వ సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రీవెన్స్‌లో ఆయా విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొంటారని, నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు, మినిస్టీరియల్ సిబ్బంది, ఆయా విభాగ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ఎదురవుతున్న, సర్వీస్‌కి సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చన్నారు. ఉద్యోగులు తమ సమస్యల పై అందించే అర్జీలను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, తదుపరి గ్రీవెన్స్ నాటికి ప్రస్తుతం అందిన అర్జీల పరిష్కార వివరాల రిపోర్ట్ తో హాజరు కావాలని మేనేజర్‌ను ఆదేశించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని, ఉద్యోగులు కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, మేనేజర్ శివన్నారాయణ, వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో కార్తిక సందడి

అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం కార్తిక సోమవారం కిటకిటలాడింది. వేకువజా మునుండే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చిన పంచారామక్షేత్ర సందర్శన భక్తులు పూజలు చేశారు. పవిత్ర కృష్ణాజలాలలో కార్తిక స్నానాలు చేసి, ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద కార్తిక దీపారాధనలు చేసి కార్తిక దామోదరునికి విశేషపూజలు నిర్వహించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు శివపంచాక్షరీ నామంతో అమరేశ్వరాలయం ప్రతిధ్వనించింది. ఉదయం సుమారు 70 పైగా బస్సులలో పంచారామ క్షేత్రసందర్శన యాత్రికులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ కార్తిక సోమవారం విశిష్టతను వివరించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ పర్యవేక్షించారు. సుమారు 12 వేల మంది భక్తులు దర్శించుకున్నారని దేవాలయ అధికారుల అంచనా.

పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ రాష్ట్రజట్టు ఎంపిక

సత్తెనపల్లి: క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలను సాధించి పల్నాడు జిల్లాకు మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ పసుపులేటి సురేష్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పవర్ హౌస్ ఫిట్నెస్ కార్యాలయంలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి సోమవారం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు బెంగళూరులో ఈ నెల 22 నుంచి 26 జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ - బెంచ్ ప్రెస్ పోటీలు జరగనున్నాయన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ అండ్ ఉమెన్ ఏక్విప్పెడ్ అండ్ అన్ ఏక్విప్పెడ్ పోటీలు నిర్వహించనున్నారన్నారు.

సుస్థిర జీవనోపాధి కల్పనే ముఖ్యమంత్రి లక్ష్యం

మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి

తాడేపల్లిరూరల్: మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాచరణ రూపొందించారని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో మెప్మా మహిళలకు పట్టణ ప్రగతి యూనిట్లపై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ పట్టణ సమాఖ్యలు ఎంపిక చేసిన సంఘసభ్యులకు సూక్ష్మ పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో భాగంగా నాలుగు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల నుంచి ప్రతి పట్టణం నుంచి స్వయంచాలక ఉపాధిని ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి కలిగిన ఒక సభ్యురాలిని పట్టణ సమాఖ్యకు ఒకరి చొప్పున ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో పట్టణ ప్రగతి యూనిట్లు అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. నేటి నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న ఈ శిక్షణా తరగతులకు రాష్ట్రం నుంచి స్వయం సహాయక సంఘం మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారని మహిళలకు కంప్యూటింగ్ పైన ఎంబ్రాయిడరీ, పేపర్ విస్తళ్లు, గుడ్డ సంచులు, వాటిపైన అచ్చు వేయడం, ఆర్టిఫిషియల్ నగల తయారీ, కర్పూరం, దీపం వత్తులు, సాంబ్రాణి, కారం, మసాలా పొడుల తయారీపైన ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మెప్మా ఎంసీ లలితశ్రీ,, ఎఓ రామాంజనేయులు, ఎస్ఎంసీ శ్రీనివాస్, కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి

రైలుకింద పడి ప్రేమికులు ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన పావని, రాకేష్ (ఫైల్)

గూడూరు రూరల్ (తిరుపతి జిల్లా): విజయవాడలోని కోచింగ్ సెంటర్లో కుదిరిన స్నేహం విడదీయరాని బంధంగా ఏర్పడింది. పెద్దలు ఎక్కడ తమను కలుసుకోకుండా చేస్తారో అన్న భయంతో ఆ జంట గూడూరుకు సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంచలనం కలిగించింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా శ్రీరుక్మిణీపురానికి చెందిన అన్నంగి పావని (19) హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది. చిల్లకూరు మండలంలోని ఓ హోటల్‌లో పని చేసేందుకు సొంత ఊరి నుంచి తల్లిదండ్రుల అనుమతి తీసుకుని రెండు రోజుల క్రితం వచ్చింది. ఇక్కడ నుంచి తనకు గతంలో విజయవాడలోని కోచింగ్ సెంటర్‌లో చదుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా, సగిపాడు గ్రామానికి చెందిన దండే రాకేష్(23)ను గూడూరుకు రావాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో ఆదివారం గూడూరు వచ్చి ఇద్దరు కలుసుకుని చాలా సేపు భావి జీవితానికి సంబంధించిన విషయాలను మాట్లాడుతుకున్నారు. అనంతరం ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ పెద్దలకు ఇష్టం లేకపోతే ఇద్దరు ఎవరికి వారు దూరం కావాల్సి వస్తుందని భావించిన వారు ఒకరిని విడిచి ఒకరు ఉండలేక గూడూరు రైల్వే స్టేషన్ నుంచి సుమారు మూడు కి.మీ దూరంలో ఉన్న గాంధీనగర్ ప్రాంతం వరకు ట్రాక్‌పై నడిచి వెళ్లి అక్కడ రైలు పట్టాలపై పడుకున్నారు. వారిపై నుంచి గూడ్స్ ట్రైన్ వెళ్లడంతో తలలు తెగి వారు అక్కడిక్కడే ప్రాణాలు విడిచారు. చిన్న వయస్సులో ప్రేమించుకున్న ప్రేమికులు పుట్టిన ఊరు నుంచి దూరంగా వచ్చి ఆత్మహత్య చేసుకోవడం గూడూరు డివిజన్‌లో సంచలనం సృషించింది. యువతీ యువకుల మృతదేహాలను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచార ఇచ్చారు. వారు సోమవారం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుల తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద రోదించడం చూసిన వారు కన్నీటి పర్యంతం అయ్యారు.

మాతృ మరణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: మాతృమరణాల నివారణకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈ క్రమంలో ఎవరి నిర్లక్ష్యం కారణంగానైనా ఇబ్బందులు ఏర్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా మాతృమరణాల సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు ముఖ్యంగా రక్తహీనత ఉన్న వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిరంతరం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. గత జూన్ నుంచి అక్టోబర్ మధ్యలో జిల్లాలో తెనాలి, గుంటూరు, మేడికొండూరు, పొన్నూరు పీహెచ్‌సీల్లో 6 మాతృ మరణాలు సంభవించాయన్నారు. దీనిపై వైద్య అధికారులు విచారించి బాధిత కుటుంబాలతో మాట్లాడాలన్నారు. మరణాలకు కారణాలను విశ్లేషించి మళ్లీ అటువంటి పొరపాట్లు జరక్కుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు సుఖంగా ప్రసవించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ఏర్పాట్లు చేసిందన్నారు. గర్భిణులు మూడో నెల నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సమస్యలుంటే అంగన్‌వాడీలు, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బందికి తెలపాలని చెప్పారు. పౌష్టికాహారంతోపాటు రక్త శాతం తప్పక చూసుకోవాలన్నారు. ఇబ్బందులను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, మాతృమరణాల కమిటీ సభ్యురాలు రాధిక రాయుడు, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి డాక్టర్ రత్న మన్‌మోహన్, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత..

గుంటూరు వెస్ట్: పిల్లల బంగారు భవిష్యత్తు సమాజానికి ఎంతో ముఖ్యమని, దీనిని కాపాడడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాల కార్మికులను గుర్తించే టాస్క్‌ఫోర్స్ వాహనాన్ని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్ఓ చంద్రశేఖరరావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ చైల్డ్ లేబర్ ఆదేశాల మేరకు వచ్చే నెల 10 వరకు బాల కార్మికులను గుర్తించేందు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే ఇప్పటికే విద్యా శాఖ ఐదు సంవత్సరాల వయస్సున్న చిన్నారులను గుర్తించి వారిని విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యనందిస్తుందన్నారు. ఇతరులు బాల కార్మికులను గుర్తిస్తే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారమందించాలన్నారు. ఆర్డీఓ పి.శ్రీకర్, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

న్యుమోనియా అవగాహన పోస్టర్లు ఆవిష్కరణ..

గుంటూరు మెడికల్: 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లల్లో వచ్చే న్యుమోనియాపై జరిగే అవగాహనా కార్యక్రమంపై ప్రచార పోస్టర్‌లను జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, డీఐఓ డాక్టర్ కె.వి సుబ్బరాజు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మా నాయక్, డాక్టర్ విజయ ప్రకాష్ పాల్గొన్నారు.

కాకాని మల్లేశ్వరుని సన్నిధిలో ప్రముఖుల పూజలు



హైకోర్టు జడ్జి ఏవీ రవీంద్రబాబు దంపతులకు స్వామివారి చిత్ర పటాన్ని అందజేస్తున్న చైర్మన్




ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి సీహెచ్ రాజగోపాల్‌రావు దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

పెదకాకాని: కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయంలో పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఏవీ రవీంద్రబాబు దంపతులు, గుంటూరు జిల్లా ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి సీహెచ్ రాజగోపాల్‌రావు దంపతులు, ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేసి భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖులకు అర్చకులు, వేద పండితుల స్వామివారి వేద ఆశీర్వచనం చేశారు. దేవస్థాన అధికారులు, పాలకమండలి చైర్మన్‌లు ప్రముఖులను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

లా కోర్సుల్లో ప్రవేశాలకు వేళాయె

- లాసెట్, పీజీ లాసెట్ రిజిస్ట్రేషన్ల గడువు ఈనెల 22 వరకు పొడిగింపు
- ప్రవేశాల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే..
- 24 వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన
- 25, 26, 27 తేదీల్లో కళాశాలల ఎంపికకై ఆప్షన్లు నమోదు
- 30న సీట్ల కేటాయింపు, డిసెంబర్ 1, 2 తేదీల్లో కళాశాలల్లో చేరికలు



గుంటూరు ఎడ్యుకేషన్: లా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 25వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. లాసెట్, పీజీ లాసెట్‌లో అర్హత పొంది రెండేళ్లు, మూడేళ్లు, ఐదేళ్ల లా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈనెల 25, 26, 27వ తేదీల్లో కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఏపీ లా–సెట్, పీజీ లా–సెట్ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసిన షెడ్యూల్లో భాగంగా సోమవారం ముగిసిన రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 22వ తేదీ వరకు పొడిగించింది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని విద్యార్థులకు మరో అవకాశాన్ని కల్పించారు. అదే విధంగా రిజిస్ట్రేషన్ సమయంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 24 వరకు కొనసాగనుంది. లాసెట్, పీజీ లాసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన, కళాశాలల ఎంపిక ప్రక్రియ మొత్తాన్ని పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోంది. కాగా ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థులు తమ సర్టిఫికెట్ల పరిశీలన కోసం మంగళవారం విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో హాజరు కావాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు మరోసారి ఆప్షన్లను మార్చుకునేందుకు ఈనెల 28న ఒక్క రోజు అవకాశాన్ని కల్పించిన ఉన్నత విద్యామండలి ఈనెల 30న సీట్ల కేటాయింపు జరపనుంది. సీట్లు పొందిన విద్యార్థులు డిసెంబర్ ఒకటి, రెండవ తేదీల్లో సంబంధిత కళాశాలలకు వెళ్లి చేరాల్సి ఉంది. ఎల్ఎల్‌బీ, బీఎల్ అర్హతతో రెండేళ్ల ఎల్ఎల్ఎం, ఇంటర్మీడియెట్ అర్హతతో ఐదేళ్లు, డిగ్రీ అర్హతతో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశాలను కల్పించనున్నారు. ఈ విధంగా న్యాయ విద్యలో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను పూర్తిగా ఆన్‌లైన్‌లో చేపడుతున్న ఉన్నత విద్యామండలి విద్యార్థులు భౌతికంగా హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేసింది.

ప్రతి ఏటా పూర్తిస్థాయిలో సీట్ల భర్తీ..

కాగా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంతో పాటు ప్రైవేటు రంగంలో విజ్ఞాన్, కేఎల్ యూనివర్సిటీలతో పాటు గుంటూరు నగర పరిధిలో జేసీ లా కళాశాల, ఏసీ లా కళాశాలలు ఉన్నాయి. లా కోర్సులపై పెరిగిన అవగాహన, న్యాయ నిపుణులకు నెలకొన్న డిమాండ్ దృష్ట్యా ప్రతి యేటా సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అవుతున్నాయి. కాగా లాసెట్, పీజీ లాసెట్ ప్రవేశాలకు సంబంధించిన కళాశాలల జాబితాను ఉన్నత విద్యామండలి ఈనెల 25న అధికారిక సైట్‌లో ఉంచనుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆయా కళాశాలల్లో సీట్ల కోసం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది.

ముగిసిన రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీలు

- బాలికల విన్నర్ విజయనగరం, రన్నరప్‌గా అనంతపురం
- బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజయనగరం, వైఎస్సార్ కడప జట్లు



విన్నర్‌గా నిలిచిన విజయనగరం జిల్లా బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం



అండర్-14 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్ర బాలికల జట్టు

పెదకాకాని: క్రీడాకారులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభమైన మూడు రోజుల సాఫ్ట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. 67వ ఏపీ ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు అండర్ -14 బాలబాలికల విభాగాలలో 13 జిల్లాల నుంచి 476 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా బాలుర జట్టు విన్నర్‌గా ప్రథమ స్థానంలో నిలవగా రన్నర్‌గా కడప జట్టు కైవసం చేసుకుంది. తృతీయ స్థానంలో నెల్లూరు జిల్లా జట్టు నిలిచింది. అలాగే అండర్–14 బాలికల విభాగంలోనూ విజయనగరం జిల్లా జట్టు విన్నర్ కాగా అనంతపురం జట్టు రన్నర్‌గా నిలిచింది. గుంటూరు జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు మెడల్స్ బహూకరించడంతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. విన్నర్, రన్నర్ స్థానాల్లో నిలిచిన జట్లకు గోల్డ్‌కప్‌లు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీలకు అండర్–14 బాల బాలికల రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పేరం మస్తాన్ రెడ్డి తెలియజేశారు. ఈ పోటీల విజేతలకు రాష్ట్ర పాఠ్యపుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి, లంకా క్రాంతిశేఖర్, సీఐ బండారు సురేష్‌బాబులు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం నంబూరు తిరుపతిరావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ కె.నాగజ్యోతి, జిల్లా సాఫ్ట్‌బాల్ కన్వీనర్ జగదీశ్వరరెడ్డి, టోర్నమెంట్ పరిశీలకులు హృదయ రాజు, జయరావు, ఎస్.వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ మేనేజర్లు, వ్యాయామోపాధ్యాయులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ONE SITTING : 10th, 12th, B.A, B.Com, B.Sc, M.Com, MBA, BBA, B.Tech., BCA, Veternery/Fisheries/ Dairy Science. (Eligible for Govt Jobs) Cont: ✆ : 73383 76874

SPOKEN ENLGISH

■ ఇంగ్లీష్ 60రోజులలో 60గట్లతో ఆఫ్/ఆన్‌లైన్ క్లాసులు వాట్సప్ ద్వారా మాట్లాడండి. రేపటి నుండి 5 రోజుల ఫ్రీ క్లాసులకు రండి. ప్రామాణిక 10/4 అరండల్ పేట,మాలకొండయ్యకాలనీ,Gnt ✆ 8440539029

REAL ESTATE

HOUSE FOR SALE

■ గుంటూరు కొత్తకాలని(కామాక్షి కాలని) 7వ లైను మిర్చియార్డు దగ్గర 50గజాల సౌత్ ఫేసింగ్ హౌస్ 100% వాస్తుతో అమ్మకం రేట్ 11లక్షలు(బి.ఫామ్) నో బ్రోకర్స్ డైరెక్ట్‌గా 8346265333

PLOT FOR SALE

■ గుంటూరు నల్లపాడు నీళ్లబావి దగ్గర తూర్పు ఫేసింగ్ గల 301 చ॥గ॥ ప్లాట్లు అమ్మకమునకు కలవు ✆ 7093885137

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 9659057777

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర ✆ 945 945 3338

LOST

■ I,Gangolu Samuelbabu S/o.Moses Gangolu,H.No 5-24-33/5-1,MotherTeressa Apartment, Ithanagar, Tenali, Guntur Dist-522201. Have Lost My Passport No: U3289181. Issue on Date:01/09/2020. While Traveling From Tenali. If Found Anyone Please Call: 7207535791.

WANTED

■ Wanted D.Ed / Graduate Lady Teachers for Pre - Primary and Primary Classes. Salary is negotiable. Sri Satya Sai ideal School, Chowtra, Guntur-3. ✆ 0863-2222114

■ విశ్రాంతి ఉద్యోగులకు శుభవార్త గుంటూరు నగరంలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో కలిసి పనిచేయుటకు 10th పాస్, 50సం॥పై వయస్సు వారు, హౌస్ వైఫ్స్ కావలెను. 9989909698

■ గుంటూరు అరండల్‌పేట 6వ లైనులోని మా జ్యూయలరీ షోరూమ్ నందు వర్క్ చేయుటకు ఆకర్షణీయమైన స్త్రీలు కావలెను. అ:ఇంటర్ ఆపైన అనుభవం గలవారికి ప్రాధాన్యత. 8099677773, 0863-2233370

■ ప్రముఖ ఆఫీస్ నందు టెలికాలర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సెక్యూరిటీగార్డ్స్, హెల్పర్స్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం:15-25వేలు, అర్హత: 7th-డిగ్రీ ✆ 9491607658, 9440817759

■ బార్ & రెస్టారెంట్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్, లిక్కర్ బాయ్స్ కావలెను. రూం+భోజన వసతి కలదు ✆ 9573271161, 8143198968

■ ప్రముఖ స్టార్ హోటల్ గీతారీజెన్సీ నందు పనిచేయుటకు హౌస్‌కీపింగ్ బాయ్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, హౌస్‌కీపింగ్ ఇన్‌ఛార్జ్, నాన్‌వెజ్ రెస్టారెంట్ వెయిటర్స్, రూమ్ సర్వీస్ వెయిటర్స్, దోసె, ఇడ్లీ, పూరీ మాస్టర్స్, వాష్ ప్యాంట్రీ వెంటనే కావలెను. సంప్ర: హోటల్ గీతారీజెన్సీ, 4/1 అరండల్‌పేట, గుంటూరు. 98663 19730

■ Wanted Male Campus Incharges. Qualification Any Degree Must be Married, Salary upto: 20000/-. Place of work Master Minds College, Guntur. Contact: 92487 33344

■ కృష్ణసాయిఖ్యాతీకాటేస్ నందు వర్క్ చేయుటకు అనుభవం కల్గిన సేల్స్‌మెన్స్, హెల్పర్స్ స్త్రీ/ పురుషులు కావలెను.సంప్ర॥ 4/1 అశోక్‌నగర్, గుంటూరు ✆ 9885513844, 9652161223

■ Wanted male and female marketing executives to work in a reputed constructions company in Guntur. Qul : Any degree with computer skills & good english ✆ 9885499666

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736928

■ స్పాట్ జాబ్ అర్హతను బట్టి జీతం ఇవ్వబడును. ట్రైనింగ్ ఇవ్వబడును. మండలాల వారిగా ఏజెంట్లు కావలెను. రెజ్యూమ్ పంపగలరు. 8143358186(W), 8688443424

■ తెనాలిలోని ప్రముఖ హాస్పిటల్ నందు రిసెపనిస్ట్(M) ల్యాబ్‌టెక్నీషియన్ (M), OT టెక్నీషియన్, నర్సింగ్ స్టాఫ్, ఫార్మసిస్ట్, అకౌంటెంట్ కావలెను. ✆08644-355801, 9666354489

■ రామకృష్ణ గ్రూప్, (AP No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. వృద్ధుల/పేషంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 63010 53500, 82475 00792

■ ప్రముఖ Y.M.C. కంపెనీలో 18 సం॥ నిండిన యువకులకు ఉచిత శిక్షణ. అర్హత 10th to డిగ్రీ P/F + ఫ్రీ రూం, శిక్షణలో 10000/- శిక్షణ తర్వాత 26000 /- సంపాదించేవకాశం. Cont: 9032186841

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K , Ph: 9160900024/ 9640400073

■ ప్రముఖ హోంకేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు కా॥. జీ: 16,000-25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9881975219

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ నెంబర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97030 13015
97034 67843
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి బిజినెస్
మంగళవారం
21-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
140	38
65,655	19,694

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,246	△ 121
డోజోన్స్	35,072	△ 125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,496	▽ 8
డాక్స్	15,901	▽ 18
షాంఘై	3,068	△ 14
నికాయ్	33,388	▽ 197

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,888
బంగారం (99.5 స్వచ్ఛత)	60,644
వెండి (కిలో)	72,561

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.52	84.19
£	బ్రిటన్ పౌండ్	102.38	105.73
€	యూరో	89.52	92.61
¥	జపాన్ ఎన్ (100)	55.11	56.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.39	55.74
S$	సింగపూర్ డాలర్	59.89	64.58
SAR	సౌదీ రియాల్	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	21.79	23.59
¥	చైనా యువాన్	10.51	12.58

నష్టాలొస్తున్నా ఫ్యూచర్స్ ట్రేడింగ్

ఇన్వెస్టర్ల తీరుపై సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి ఆశ్చర్యం



బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఇన్వెస్టర్ రిస్క్ రిడక్షన్ యాక్సెస్ (ఐఆర్ఆర్ఏ) ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభిస్తున్న బీఎస్‌ఈ చైర్‌పర్సన్ ఎస్ఎస్ ముంద్రా, ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తితో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్

ముంబై: ఫ్యూచర్స్, ఆప్షన్స్ విభాగంలో 90 శాతం మంది నష్టపోతున్నా.. ఇన్వెస్టర్లు మాత్రం డెరివేటివ్స్‌నే ఇష్టపడుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ వ్యాఖ్యానించారు. ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక దృష్టితో మదుపు చేయాలని, తద్వారా ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులు అందుకోవడానికి అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. బీఎస్ఈలో ఇన్వెస్టర్ రిస్క్ రిడక్షన్ యాక్సెస్ (ఐఆర్ఆర్ఏ) ప్లాట్‌ఫాంను ఆవిష్కరించిన సందర్భంగా బుచ్ ఈ విషయాలు తెలిపారు. సెబీ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో ఎఫ్అండ్‌వో సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసిన 45.24 లక్షల మందిలో కేవలం 11 శాతం మంది మాత్రమే లాభాలు ఆర్జించినట్లు వెల్లడైందని ఆమె చెప్పారు. పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండవని తెలిసీ చాలా మంది ఇన్వెస్టర్లు డెరివేటివ్స్‌పై బెట్టింగ్ చేస్తుండటమనేది తనకు కాస్త గందరగోళ వ్యవహారంగా అనిపిస్తుందని బుచ్ చెప్పారు. ప్రతిరోజూ ఎఫ్అండ్‌వో సెగ్మెంట్‌లో డబ్బులు పోగొట్టుకోవడం కన్నా పెట్టుబడుల విషయంలో దీర్ఘకాలికమైన, నిలకడైన వ్యూహాన్ని పాటించడం శ్రేయస్కరమని, తద్వారా సంపదను సృష్టించుకోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆమె వివరించారు.

ఐఆర్ఆర్ఏతో పొజిషన్ల స్క్వేర్ ఆఫ్..

బ్రోకరేజీ సిస్టమ్‌లో అంతరాయం ఏర్పడ్డ పక్షంలో ట్రేడరు తమ ఓపెన్ పొజిషన్లను స్క్వేర్ ఆఫ్ చేసుకునేందుకు ఐఆర్ఆర్ఏ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుంది. పరిశ్రమ వర్గాల ప్రకారం బ్రోకరేజ్ సిస్టమ్ పనిచేయకపోతే ఐఆర్ఆర్ఏని డౌన్‌లోడ్ చేసుకునేందుకు ట్రేడర్‌కి ఎస్ఎంఎస్ వస్తుంది. దాన్ని ఉపయోగించుకుని రెండు గంటల వ్యవధిలోగా ట్రేడరు తమ ఓపెన్ పొజిషన్స్‌ను స్క్వేర్ ఆఫ్ చేసుకోవచ్చు.

రెండో రోజూ మార్కెట్ డీలా

సెన్సెక్స్ 140 పాయింట్లు డౌన్ • 65,655 వద్ద ముగింపు • నిఫ్టీ 38 పాయింట్లు మైనస్

వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. విదేశీ **పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) నిరంతర అమ్మకాలు** ప్రభావం **చూపాయి. ఆటో, యుటిలిటీ, కమోడిటీ షేర్లు అమ్మకాల** ఒత్తిడికి **లోనయ్యాయి. వెరసి సెన్సెక్స్ 140 పాయింట్లు క్షీణించి** 65,655 వద్ద **ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్ల నష్టంతో 19,694 వద్ద** స్థిరపడింది. **ఆద్యంతం హెచ్చుతగ్గుల మధ్య కదిలిన మార్కెట్లు** చివరికి **అమ్మకాలదే పైచేయి కావడంతో వెనకడు**గు వేశాయి. **వెరసి సెన్సెక్స్ 65,844 పాయింట్ల** వద్ద గరిష్టాన్ని **తాకగా.. 65,548 స్థాయిలో** కనిష్టాన్నీ చవి **చూసింది. ఇది 247 పా**యింట్ల నష్టం **కాగా.. ఇంట్రాడేలో** నిఫ్టీ సైతం **19,756–19,670 పా**యింట్ల మధ్య **ఊగిసలాడింది.** దీర్ఘకాలంగా **బలపడుతున్న** వడ్డీ రేట్లు, **ప్రపంచ ఆర్థి**క మందగమ**నంపై ఆం**దోళనలు అ**మ్మకాలకు** దారి చూపు**తున్నట్లు** మార్కెట్ **విశ్లేష**కులు అభిప్రా**య**పడ్డారు.

ఐటీ ప్లస్‌లో

ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఆటో, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ రంగాలు 0.8–0.3 శాతం మధ్య డీలా పడగా.. ఐటీ 0.6 శాతం పుంజుకుంది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం, ఎస్‌బీఐ లైఫ్, అల్ట్రాటెక్, బజాజ్ ఫిన్, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, యూపీఎల్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ 2.6–1 శాతం మధ్య నష్టపోయాయి. ఇతర బ్లూచిప్స్‌లో దివీస్, ఎయిర్‌టెల్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, టెక్‌మహీంద్రా 2–0.7 శాతం మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్లు ఓకే

బీఎస్ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ యథాతథంగా నిలిస్తే.. స్మాల్ క్యాప్ 0.4 శాతం బలపడింది. ట్రేడైన షేర్లలో 1,997 నీరసించగా.. 1,840 పుంజుకున్నాయి. నగదు విభాగంలో వారాంతాన రూ. 478 కోట్ల విలువైన షేర్లు విక్రయించిన ఎఫ్‌పీఐలు తాజాగా మరో రూ. 646 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే దేశీ ఫండ్స్(డీఐఐలు) స్వల్పంగా రూ. 78 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేయడం గమనార్హం!



రూపాయి రికార్డ్ కనిష్టం



డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ చరిత్రాత్మక కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో డాలరుతో మారకంలో 12 పైసలు కోల్పోయి 83.38 వద్ద ముగిసింది. ఇది సరికొత్త కనిష్టంకాగా.. ఇంతక్రితం ఈ నెల 13న 83.33 వద్ద నిలవడం ద్వారా లైఫ్‌టైమ్ కనిష్టానికి చేరింది. కాగా.. వారాంతాన రూపాయి 83.26 వద్ద నిలవగా.. తాజాగా 83.25 వద్ద స్థిరంగా ప్రారంభమైంది. ఆపై బలహీనపడుతూ చివరికి 83.38కు చేరింది. అయితే ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు 0.4 శాతం నీరసించి 103.48 వద్ద కదులుతున్నప్పటికీ ముడిచమురు బలపడటం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు ప్రభావం చూపినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.75 శాతం పెరిగి 81.21 డాలర్లకు చేరింది. ఇక మరోవైపు ఈ నెల 10కల్లా దేశీ విదేశీ మారక నిల్వలు 46.2 కోట్ల డాలర్లు తగ్గి 590.32 బిలియన్ డాలర్లకు చేరాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-11-2023	
విశాఖ	535–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	535–00
రిటైల్ ధర (డజను)	72.00
20-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

కెనరా బ్యాంక్ నుంచి కొత్త ఉత్పత్తులు

118వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రారంభం



ఎండీ, సీఈవో కె. సత్యనారాయణ రాజు

హైదరాబాద్: ప్రభుత్వరంగ కెనరా బ్యాంక్ 118వ వ్యవస్థాపక **దినో**త్సవం సందర్భంగా పలు కొత్త **ఉత్పత్తు**లను కస్టమర్లకు **అందుబా**టులోకి తీసుకొచ్చింది. కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో కె. సత్యనారాయణ **రాజుతోపాటు** బ్యాంక్ ఎగ్జి**క్యూటివ్ డైరెక్టర్లు** ఈ ఉత్పత్తులను **ఆవిష్కరించారు.** కార్పొరేట్ కస్టమర్ల **కోసం ప్రత్యేకంగా** 'కార్పొరేట్ ఏఐ1' అనే సేవను ప్రారంభించింది. ఇందులో **భాగంగా ఇంటర్నెట్ బ్యాంకింగ్**తోపాటు, ప్రత్యేకంగా 'కెనరా ఏఐ1 కార్పొరేట్' అనే **యాప్ ద్వారా లావాదేవీలు నిర్వహిం**చుకోవచ్చు. అలాగే, 18 రకాల సేవలను వాట్సాప్ **బ్యాంకింగ్ చానల్ ద్వారా అందిస్తున్న**ట్లు ప్రకటించింది. కస్టమర్లు 9076030001 అనే **వాట్సాప్ నంబర్‌కు హాయ్/హెలో అని** మెస్సేజ్ పంపడం ద్వారా, కావాల్సిన సేవను పొం**దొచ్చు**. అలాగే, కెనరా యూపీఐ 123 పే పేరుతో ఫీచర్ **ఫోన్లను** వినియోగిస్తున్న వారి కోసం ఐవీఆర్ ఆధారిత **యూపీ**ఐ సేవను సైతం కెనరా బ్యాంక్ తీసుకొచ్చింది. ఏ **బ్యాంక్** ఖాతాదారులు అయినా 'కెనరా యూపీఐ 123 పే' **సేవల**ను వినియోగించుకోవచ్చని ప్రకటించింది.



పోస్టాఫీసుల్లో బ్లూడార్ట్ డిజిటల్ లాకర్ సేవలు





న్యూఢిల్లీ: భారతీయ తపాలా శాఖతో బ్లూడార్ట్ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన తపాలా కార్యాలయాల్లో బ్లూడార్ట్ డిజిటల్ లాకర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనివల్ల పార్సిల్ పొందాల్సిన వ్యక్తి రోజులో 24 గంటల్లో ఎప్పుడైనా డిజిటల్ లాకర్ వద్దకు వెళ్లి తీసుకోవడానికి అవకాశం ఉంటుందని బ్లూడార్ట్ ప్రకటించింది. ఎలాంటి సంతకాలతో పనిలేదని పేర్కొంది. పోస్టాఫీస్‌తో వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో ఆటోమేటిడ్ డిజిటల్ పార్సిల్ లాకర్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. లాకర్లలో పార్సిల్స్ సురక్షితంగా ఉంటాయని, తమకు కేటాయించిన కోడ్‌ను నమోదు చేయడం ద్వారా సులభంగా ప్యాకేజీను పొందొచ్చని వివరించింది. కేవలం గుర్తింపు ఉన్న వ్యక్తే వీటిని పొందగలరని తెలిపింది. కస్టమర్లు తమ వీలు ప్రకారం ప్యాకేజీలను పొందే అవకాశం కల్పించడమే ఇందులోని ఉద్దేశంగా బ్లూడార్ట్ ఎండీ బాల్‌ఫోర్ మాన్యుయేల్ ప్రకటించారు.

వృద్ధి స్పీడ్‌కు 'ఎన్నికల' అడ్డంకి

- 2024 ఎకానమీ అంచనా తగ్గించిన గోల్డ్‌మన్ శాక్స్
- 6.4 శాతం నుంచి 6.3 శాతానికి..



ముంబై: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2024 వృద్ధి అంచనాలను అమెరికన్ బ్రోకరేజ్ సంస్థ 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 2023లో తొలి 6.4 శాతం అంచనాలను తాజాగా 6.3 శాతానికి తగ్గిస్తున్నట్లు తాజా నివేదికలో పేర్కొంది. ఎన్నికల సంవత్సరం అనిశ్చితి నెలకొనే అవకాశం తన తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి నమోదవుతుందని సంస్థ అంచనావేసింది. ఇక 2024లో వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉంటుందన్నది శాక్స్ అంచనా. 2023లో ఈ అంచనా 5.7 శాతంగా పేర్కొంది. 2025 తొలి నెలల్లోపు ఆర్‌బీఐ రెపో రేటు ప్రస్తుత 6.5 శాతం నుంచి అరశాతం తగ్గుతుందన్నది గోల్డ్‌మన్ శాక్స్ అంచనా. డాలర్ మారకంలో రూపాయి విలువ 2023లో సగటును 83గా ఉంటే, 2024లో 82కు బలపడుతుందని శాక్స్ నివేదిక పేర్కొంది.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



తిరుపతి జిల్లా గూడూరులో సంక్షేమ పథకాల వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు



కృష్ణా జిల్లా పామర్రులో అభివృద్ధి పనులకు సంబంధించిన బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



అంబేడ్కర్ కోనసీమ జిల్లా భట్నవిల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు



వైఎస్సార్ జిల్లా పైడికాలువలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి



పశ్చిమగోదావరి జిల్లా ప్రాతాళ్లమెరకలో సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నరసింహరాజు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో

భారీ అగ్ని ప్రమాదం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
- బాధితులను ఉదారంగా ఆదుకోవాలని.. అధికారులకు ఆదేశం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం షిప్పింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఓ బోటులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 45 బోట్లు కాలిపోయాయి. ఉద్దేశ్యపూర్వకంగానే కొందరు మద్యం మత్తులో ఈ బోట్లకు నిప్పు పెట్టినట్టు పోలీసులు ప్రాథమికంగా అనుమానించినప్పటికీ అది నిర్ధారణ కాలేదు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత మత్స్యకారులను ఆదుకునే విషయంలో ఆయన చాలా ఉదారంగా స్పందించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80 శాతం మేర పరిహారంగా అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అలాగే, ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి కారణాలు వెలికితీయాలన్నారు.

ప్రమాదవశాత్తూ దుర్ఘటన..

తొలుత.. ఆదివారం అర్ధరాత్రి కొంతమందితో కలిసి ఓ యూట్యూబర్ హార్బర్‌లోని జీరో నెంబర్ జెట్టీలో లంగరు వేసి ఉన్న బోటులో మందు పార్టీ చేసుకున్నాడని, వారిలో వారికి గొడవ మొదలై నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అనుమానించారు. అలాగే, యూట్యూబర్‌కు చెందిన బోటును మరొకరికి అమ్మారని, కొనుగోలు చేసిన వ్యక్తి ఆ సొమ్మును సకాలంలో ఇవ్వకపోవడంతో బోటును తగులబెడ్తానని కొన్నాళ్లుగా హెచ్చరిస్తున్నాడని, అలా ఆదివారం అర్ధరాత్రి అన్నంత పనీ చేశాడన్న ప్రచారం కూడా జరిగింది. సంఘటన స్థలంలో ఉండి తగలబడిపోతున్న బోట్లను తన సెల్‌ఫోన్లో యూట్యూబర్ చిత్రీకరించి తన యూట్యూబ్‌లో ఉంచడం కూడా ఈ అనుమానాలకు బలం చేకూరింది. దీంతో పోలీసులు ఆ యూట్యూబర్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో అది నిర్ధారణ కాకపోవడంతో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం సంభవించిందని పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు.. ఈ జెట్టీలో 10 రోజుల క్రితం వరకు సీసీ కెమేరాలు ఉండేవి. కానీ, హార్బర్ ఆధునీకరణ పనుల కారణంగా వీటిని తొలగించారు. దీంతో ఘటనపై దర్యాప్తునకు ప్రతిబంధకంగా మారింది.

45 మెకనైజ్డ్ బోట్లు అగ్నికి ఆహుతి..

ఈ ప్రమాదంలో మొత్తం 45 మెకనైజ్డ్ బోట్లు దగ్ధమైనట్లు అధికారులు గుర్తించారు. వీటిలో 36 బోట్లు పూర్తిగాను, తొమ్మిది బోట్లు పాక్షికంగాను దగ్ధమయ్యాయి. కొన్ని బోట్లు పూర్తిగా నీటిలో మునిగిపోగా మరికొన్ని వాటి ఆనవాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇక సోమవారం తెల్లవారుజామున వేటకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న బోట్లు, వేటకు వెళ్లి హార్బర్‌కు వచ్చిన బోట్లు కూడా ప్రమాదానికి గురయ్యాయి. ఈ బోట్లలో ఉన్న వేల లీటర్ల డీజిల్, టన్నుల కొద్దీ వేటాడి తెచ్చిన చేపలు, రొయ్యలు అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కో బోటు విలువ దాని స్థితిని బట్టి రూ.25 నుంచి 60 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ లెక్కన అగ్నిప్రమాదంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్టు భావిస్తున్నారు.

అప్రమత్తమైన యంత్రాంగం

ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే విశాఖ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అందుబాటులో ఉన్న అగ్నిమాపక శకటాలను హుటాహుటిన ఘటనా స్థలానికి తరలించింది. అగ్నిమాపక శాఖ శకటాలతోపాటు విశాఖ పోర్టు అథారిటీ, కోస్ట్‌గార్డు, నేవీలకు చెందిన అత్యాధునిక ఫైర్ ఫైటింగ్ వాహనాలను రంగంలోకి దించారు. సుదీర్ఘ శ్రమ అనంతరం ఎట్టకేలకు సోమవారం వేకువజామున మంటలను అదుపు చేయగలిగారు. మంటలు ఇతర బోట్లకు వ్యాపించకుండా విజయవంతంగా కట్టడి చేశారు.

తప్పిన పెనుముప్పు..

హార్బర్‌లో అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతానికి కొద్దిమీటర్ల దూరంలోనే హిందుస్తాన్ పెట్రోలియంకు చెందిన డీజిల్ బంకరింగ్ ఇన్‌స్టాలేషన్ ఉంది. అక్కడ 365 కిలోలీటర్ల డీజిల్ నిల్వలున్నాయి. అలాగే, హార్బర్ సమీపంలోనే విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీసీటీపీఎల్) కూడా ఉంది. అక్కడ ఇతర దేశాలకు ఎగుమతి చేసే సరుకూ సిద్ధంగా ఉంది. దీంతో ఏదైనా పేలుడు సంభవించి ఆ శకలాలు వచ్చి పడితే ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. అయితే, అలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు.. పోలీసు, అగ్నిమాపక శాఖ, మత్స్యశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు రాత్రంతా ప్రమాద స్థలంలోనే ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ

ఘటనా స్థలిని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, కలెక్టర్ ఎ. మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ. రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌లు ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని ప్రమాదం తీరుతెన్నులను పరిశీలించారు. బోటు యజమానులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మరోవైపు.. టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు హార్బర్‌ను సందర్శించారు.

నష్టం తేలగానే పరిహారం: మంత్రి అప్పలరాజు

ఇక ఈ ప్రమాదంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ఉదారంగా స్పందించారని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఈ ఘటనలో బోట్లు కాలిపోయిన యజమానులకు వాటిల్లిన నష్టంలో 80 శాతం పరిహారంగా ఇవ్వాలని ఆదేశించారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో సోమవారం మధ్యాహ్నం మంత్రి ఘటనాస్థలిని సందర్శించారు. కాలిపోయిన, మునిగిపోయిన బోట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ దుర్ఘటన దురదృష్టకరమన్నారు. దగ్ధమైన బోట్ల విలువ నష్టాన్ని అంచనా వేశాక ఆ మొత్తంలో 80 శాతం ప్రభుత్వం తక్షణమే పరిహారంగా చెల్లిస్తుందన్నారు. గతంలో హుద్‌హుద్, తిత్లీ తుపానుల సమయంలోనూ ఈ హార్బర్‌లో బోట్లు దెబ్బతిన్నాయని.. కానీ, అప్పటి ప్రభుత్వం వీరికి నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా అమలుచేయలేదని ఆయన గుర్తుచేశారు. అందువల్లే ప్రభుత్వ పరిహారంపై నమ్మకంలేక మత్స్యకారుల్లో ఆందోళన నెలకొందన్నారు. కానీ, సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీని కచ్చితంగా అమలుచేస్తారని అప్పలరాజు స్పష్టంచేశారు. మంటలను అదుపుచేయడంలో విశాఖ పోర్టు, సీఐఎస్ఎఫ్, నేవీ తదితర సంస్థలు ఎంతో కృషి చేశాయని కొనియాడారు. త్వరలోనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టంచేశారు.

బాధిత మత్స్యకారులపట్ల

సీఎం జగన్ ఉదారత

బోట్ల విలువలో 80 శాతం పరిహారం ఇవ్వండి

మానవతా దృక్పథంతో సాయం చేయండి
- బోట్లకు బీమా లేదనో లేదా వేరే ఇతర సాంకేతిక కారణాలు చెప్పకండి
- భవిష్యత్తులో బోట్లకు బీమా చేయించుకునేలా తోడ్పాటునివ్వండి
- ఇలాంటి కష్టకాలంలోనే వారికి మనం భరోసా కల్పించాలి

సాక్షి, అమరావతి: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం కారణంగా బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు కనీవినీ ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయం ప్రకటించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80 శాతం మేర పరిహారంగా అందించాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఘటనా స్థలానికి వెళ్లాలని కూడా సూచించారు. ఈ దుర్ఘటనపై సోమవారం ఉదయం సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి సీదిరి అప్పలరాజు సహా జిల్లా కలెక్టర్ ఘటనా స్థలానికి వెళ్లారని.. బాధితులకు పూర్తి భరోసానిచ్చామని వారు చెప్పారు. ప్రమాదంలో 36 బోట్లు దగ్ధం కాగా, మరో 9 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ప్రమాదంలో బోట్లు దగ్ధంకావడం మత్స్యకారుల జీవితాలకే పెద్దదెబ్బ అని.. ఇలాంటి పరిస్థితుల్లో వారి జీవితాలను నిలబెటాల్సిన అవసరం ఉందన్నారు. సాయం విషయంలో అత్యంత మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. మానవత్వం అనే పదానికి అర్థం చెబుతూ.. మత్స్యకారుల జీవితాలను తిరిగి నిలబెట్టేలా ఈ సాయం ఉండాలన్నారు. అందుకే ఈ విషయంలో ఉదారంగా ఉండాలని ఆదేశించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80శాతం మేర పరిహారంగా ఇవ్వాలని, వారు తిరిగి తమ జీవితాలను నిలబెట్టుకునేలా అండగా ఉండాలన్నారు. బోట్లకు బీమా లేదనో, లేక వేరే ఇతర సాంకేతిక కారణాలను చూపి బాధితుల జీవితాలను గాలికి వదిలేయడం సరికాదన్నారు. ఇలాంటి కష్టం కాలంలోనే వారికి పూర్తి భరోసా కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని సీఎం జగన్ అధికారులకు స్పష్టంచేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాద సమయాల్లో ఇబ్బందిలేకుండా బోట్లకు బీమా చేయించుకునేలా అధికారులు తోడ్పాటు అందించాలన్నారు.

రూ.12కోట్ల మేర నష్టం!

ఇక ప్రాథమిక అంచనా ప్రకారం.. బోట్ల దగ్ధం కారణంగా దాదాపు రూ.12 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లుగా భావిస్తున్నారని, అధికారులు తుది నివేదిక సిద్ధంచేస్తున్నారని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు